నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి సీఎంఆర్, జీపీపల్లి ఫీడర్ల పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీరప్పగడ్డ, అయోధ్య చౌరస్తా రోడ్డు, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ప్రైవేటు స్కూల్‌లో పుస్తకాలు, యూనిఫామ్ విక్రయాలు..

గదులను సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులు

మేడ్చల్ : నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు స్కూల్‌లో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను, యూనిఫారంలను విక్రయిస్తుండటంతో మేడ్చల్‌కు చెందిన ఏబీవీపీ నాయకులు స్కూళ్ల వద్ద ధర్నా చేశారు. పట్టణంలోని పలు ప్రైవేటు స్కూళ్లలో తనిఖీలు చేసి ప్రత్యేకంగా గదుల్లో పుస్తకాలు, దుస్తులు నిల్వచేసి విక్రయిస్తుండటంతో నిరసన తెలిపారు. విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇచ్చి వారికి అక్కడ చోటు చేసుకుంటున్న పనులను ప్రత్యక్షంగా చూపించారు. నిబంధనలకు వ్యతిరేఖంగా విక్రయాలు జరుగుతుండటంతో వాటిని అధికారులు సీజ్ చేశారు.

ఎంబీసీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

సాక్షి,సిటీబ్యూరో: 'అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ' (ఎంబీసీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు చెందిన ఎంబీసీ నిరుద్యోగ యువతీయువకులకు 4 రోజుల ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి ఝాన్సీరాణి తెలిపారు. ఈ శిక్షణలో సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, రెజ్యూమ్ బిల్డింగ్, కమ్యూనికేషన్ ఫౌండేషన్, మాక్ ఇంటర్వ్యూలు, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ బిల్డింగ్ – మెంటల్ వెల్బ్ఇయింగ్ ట్రైనింగ్ లాంటి శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో ట్రావెలింగ్ అలవెన్స్, భోజనం, వసతి సదుపాయం పూర్తిగా ఉచితంగా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన దరఖాస్తుదారులు ఈనెల 12 వరకు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ఈనెల 24 సాయంత్రం 5 గంటల వరకు మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన

శామీర్‌పేట్: వ్యవసాయ సాంకేతికత, పంటల నిర్వహణ, ప్రభుత్వ పథకాలు, మార్కెటింగ్ వ్యవస్థ వంటి అంశాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ అధికారులు అన్నారు. మంగళవారం అలియాబాద్, తూంకుంట మున్సిపాలిటీల పరిధిలోని పొన్నాల్, ఆద్రాస్‌పల్లి, అలియాబాద్, బొమ్మరాసిపేట్ గ్రామాల రైతులు లాల్‌గడి మలక్‌పేట్‌లోని రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మేడ్చల్ జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీధర్, రాజిరెడ్డి, ఉద్యానశాఖ జెడీ బాబు, మండల వ్యవసాయాధికారి రమేష్, మండల ఉద్యాన అధికారి రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి సుధీర్, రైతులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల సందర్శన

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్రూమ్ ఇళ్లను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సందర్శించారు. మంగళవారం రాత్రి డబుల్ బెడ్రూమ్ నివాసితులు ఉదయం ఎంపీ నివాసంలో కలిసి తమ సమస్యలు విన్నవించారు. దీంతో సమస్యలు తమ ఇళ్ల వద్దకు వచ్చి పరిశీలిస్తానని హామీ ఇచ్చిన ఎంపీ ఇచ్చిన మాట ప్రకారం సాయంత్రం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు సమస్యలు విన్నవించగా.. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. డబుల్‌బెడ్రూమ్ వచ్చిన నాడు సంబరపడ్డారని, కానీ సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. తనపై నమ్మకంతో వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అర్బన్ రెసిడెన్షియల్‌లో 'కుక్' ఉద్యోగం

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ రెసిడెన్షియల్ అర్బన్ బాలుర పాఠశాలలో కుక్ (అవుట్ సోర్సింగ్) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతి విద్యార్హత కలిగి ఉండి, ఎక్కువ మందికి వంట చేయగల్గిన సామర్థ్యం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 11 సాయంత్రం 4.30 గంటల లోపు మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని విజయకుమారి సూచించారు.

అంగన్‌వాడీల్లో ఆడుకునేందుకు చోటేది ?

- ఆరు బయటే పోషకాహారం
- చిన్నారులకు ఆటస్థలం కరువు
- ఇబ్బంది పడుతున్న గర్భిణులు, బాలింతలు

పుట్టిన బిడ్డల ఎదుగుదలకు దోహదపడేలా చిన్నతనం నుంచి పౌష్టికాహారం అందించడంతో పాటు పాఠశాల వాతావరణం అలవాటు చేసేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణలో భాగంగా పిల్లలకు అందించాల్సిన విద్య, వారిలో సృజనాత్మకత పెంపొందించాల్సిన అంశాలపై ఓ ప్రణాళిక రూపొందించింది. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య (ప్రీ స్కూల్)ను ప్రవేశపెట్టింది. పిల్లలకు ఆట, పాటలతో జ్ఞానాన్ని పెంపొందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కేంద్రాల నిర్వహణకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఏటా కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోంది. అయితే సంబంధిత కేంద్రాల పనితీరులో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరువైంది.

– జవహర్‌నగర్


శివాజీనగర్‌లో ఇరుకు గదుల్లో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

అట్ట పెట్టెలకే పరిమితం..

అంగన్‌వాడీల్లో విధులు నిర్వహించే కార్యకర్తలు పని ఒత్తిడితో పాటు సరైన ఆటస్థలం లేక అద్దె గదుల్లో ఆటపాటలపై అంత శ్రద్ధ చూపించడం లేదు. ఈ క్రమంలో కొన్ని కేంద్రాలలో ఖరీదైన ఆట వస్తువులు అట్ట పెట్టెలకే పరిమితమవుతున్నాయి.

22 అంగన్‌వాడీ కేంద్రాలు..

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ (అల్వాల్) జోన్ పరిధి జవహర్‌నగర్‌లో 22 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. దాదాపు 22 మందికి పైగా టీచర్లతో పాటు 22 మంది కార్యకర్తలు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ భవనాలకు సొంతగూడు లేక కేంద్రాలకు వచ్చే చిన్నారులు ,గర్భిణులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జవహర్‌నగర్‌లో 22 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. 18 కేంద్రాలకు భవనాలు నిర్మించారు.

4 కేంద్రాల్లో ఇబ్బంది..

4 కేంద్రాలకు (శివాజీనగర్, శ్రీరాంనగర్, ఫైరింగ్‌కట్ట, చంద్రపురికాలనీ) భవన సదుపాయం లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, చాలీచాలని గదుల్లో కూర్చోలేక ఆరు బయటే ఉంటున్నారు. చిన్నారులకు ఆటస్థలం కరువైంది. పౌష్టికాహారం సైతం ఆరు బయటే అందిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

వర్షాలు కురిసినప్పుడు అద్దె ఇళ్లు లీకేజీ కావడంతో సరుకులు, రికార్డులను భద్రపరిచేందుకు నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. చాలా సెంటర్లలో టాయిలెట్లు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించాలని పలుమార్లు కోరినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు స్పందించి భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు స్థలాలు కేటాయించి నూతన భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.

ప్రాథమిక విద్యా విధానం..

3 నుంచి ఆరేళ్ల పిల్లలకు ఆట,పాట ద్వారా శారీరక, మానసిక దృఢత్వం, విదయ ద్వారా జ్ఞానాన్ని పెంపొందించడం అంగన్‌వాడీల ప్రత్యేక లక్ష్యం. ముఖ్యంగా పాటలు, అభినయ గేయాలు, కథలు, పెద్దలను గౌరవించే విధానాలు, శుభ్రత, ఆహారపు అలవాట్లపై అవగాహన పెంచాల్సి ఉంటుంది.

రోజంతా రికార్డులకే..

రోజూ సుమారు 15 విభాగాలకు పైగా రికార్డులు నిర్వహించాల్సి ఉంటుంది. వీటిలో ప్రధానంగా కుంటుంబ సర్వే వివరాలు, అనుబంధ పోషకాహార నిల్వలు, పూర్వ ప్రాథమిక విద్య, గర్భిణీ, ప్రసవాలు, చిన్నారులు, బాలింతలకు రేషన్ తదితర రికార్డులు నిర్వహించాలి. వీటితో పాటు వారాంతపు టీకాలు, పిల్లలు బాలింతల బరువు తదితరాలు ప్రధానంగా ఉంటాయి. అయితే రోజూ ఇన్ని రికార్డులు రాయాల్సి ఉండటంతో పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పడం సాధ్యం కావడంలేదని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొంత భవనాలు నిర్మించాలి



చిన్నారులకు ఇరుకుగదుల్లో ఆటపాటలు చెప్పలేకపోతున్నాం. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ఇస్తే కూర్చొని తినడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ సెంటర్‌కు అద్దెకు ఇవ్వడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. అధికారులు స్పందించి అంగన్‌వాడీలకు స్థలం కేటాయించి సొంత భవనాలు నిర్మించాలి.

– సుజాత, అంగన్‌వాడీ టీచర్, శివాజీనగర్

అంగన్‌వాడీ కేంద్రాలపై చిన్న చూపు



ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలపై చిన్నచూపు చూస్తోంది. కోట్లాది రూపాయలు వెచ్చించినా.. చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు సరైన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. ప్రత్యేక రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలకు ప్రాధాన్యం ఇవ్వడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నూతన భవనాలు నిర్మించి ఆట స్థలాలను కేటాయించాలి.

– జంగిడి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త

మెరుగైన వసతులు కల్పిస్తాం



ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తాం. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా నూతన భవనాలు నిర్మించుకుని ఆటలు ఆడుకునేందుకు అనువైన స్థలాలను కేటాయిస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీలైనంత త్వరలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

– వసంత, జవహర్‌నగర్, కమిషనర్

ఆర్టీసీ యాత్ర సేవలను వినియోగించుకోవాలి


మేడ్చల్ ఆర్టీసీ డీఎం సుధాకర్

మేడ్చల్: ప్రజలు తీర్థయాత్రలు చేసేందుకు ఆర్టీసీ ప్రత్యేకంగా పుణ్య క్షేత్రాలకు నడుపుతున్న బస్సుల సేవలను మేడ్చల్ ప్రాంత ప్రజలు ఉపయోగించుకోవాలని మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్ కోరారు. మేడ్చల్ నుంచి రాష్ట్రంలోని పలు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. మేడ్చల్ నుంచి దక్షిణ బద్రీనాద్, వర్గల్ సరస్వతీ అమ్మవారి దేవాలయం, కొమురవెల్లి, స్వర్ణగిరి తదితర ప్రాంతాలను కలుపుతూ.. ఒకే రోజు దర్శనాలు పూర్తయ్యేలా బస్సులు నడుపుతున్నామని యాత్రలకు వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

సాక్షి,సిటీబ్యూరో: పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికవర్గాన్ని బలిచేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని 9 కార్మిక సంఘాలు నేడు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు చింతల యాదయ్య కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఏపీలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు మార్చటాన్ని అక్కడి కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. కార్మిక వర్గం ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తుందని విమర్శించారు. ఈ కోడ్ల ద్వారా కార్మిక వర్గం మళ్లీ బానిస వ్యవస్థలోకి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వీటి రద్దుకు 9 కార్మిక సంఘాలు పోరాడుతున్నాయని పేర్కొన్నారు.

తాటిచెట్లను రీప్లాంటేషన్ చేయాలి


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

పోచారం: వందల ఏళ్లనాటి తాటి చెట్లను నరికివేయకుండా సమీపంలోనే రీప్లాంటేషన్ చేయ్యాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల్‌లో సర్వేనెంబర్లు 311, 312, 313, 324, 326పార్టు, 327పార్టులో హెచ్‌ఎండీఏ వెంచర్ ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు తాటిచెట్లను నరికివేస్తుండగా గీత కార్మికులు అడ్డుకుని ధర్నా చేపట్టారు. మంగళవారం ఈటల మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఉపయోగాలున్న తాటిచెట్లు ఏపుగా పెరగడానికి చాలా ఏళ్లు పడుతుందన్నారు. సుమారు 300 కుటుంబాలు కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. వీరికి అన్యాయం జరిగితే సహించేదిలేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, బీ– బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నాయకులు పల్లె బాబూరావు, బాలరాజ్‌గౌడ్, కుర్ర విఘ్నేశ్వర్, అనిల్‌గౌడ్, కట్ట దర్శన్, భాస్కర్, నగేష్, వెంకట్, గీత కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

నైబర్‌వుడ్ సెంటర్ ఆకస్మిక తనిఖీ


మాట్లాడుతున్న డీఆర్‌డీఓ సాంబశివరావు

ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లోని దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) సాంబశివరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు, తల్లితండ్రులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులను నిత్యం కేంద్రానికి పంపించాలని సూచించారు. ఇంట్లో దివ్యాంగులతో ఫిజియోథెరపీ చేయిస్తే మంచి ఫలితాలు పొందొచ్చన్నారు. దివ్యాంగులను చిన్న చూపు చూడొద్దని, దేశాభివృద్ధిలో వారు కూడా భాగమేనన్నారు. కేంద్రానికి వచ్చే చిన్నారులను ప్రేమగా చూడాలని పేర్కొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి


భూసార పరీక్ష ఫలితాల పత్రాలను అందజేస్తున్న ఆర్డీఓ చంద్రకళ

కీసర: కీసర మండలం యాద్గర్‌పల్లిలోని రైతువేదికలో మే, జూన్ నెలలో తీసిన మట్టి నమూనాలకు భూసార పరీక్ష ఫలితాల పత్రాలను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులందరూ భూసార పరీక్ష ఫలితాల కార్డు ఆధారంగా ఎరువులు వాడుకోవాలని సూచించారు. యూరియా అధికంగా వాడొద్దని సూచించారు. పశువుల ఎరువు, కంపోస్ట్, సేంద్రియ ఎరువు వాడుకుని భూసారం పెంచుకోవాలన్నారు. ఏడీఏ వెంకట్రాంరెడ్డి, ఎంఏఓ మాధవీలత, భూసార ల్యాబ్ ఏఈ కృష్ణవేణి, ఏఈవో వందన, రాజ్‌కుమార్, చీర్యాల సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భూ భారతి సదస్సు దరఖాస్తులకు వెంటనే పరిష్కారం

అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి


సమీక్షలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్: మండలంలో రెవెన్యూ అధికారులు నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులకు తహసీల్దార్ వెంటనే పరిష్కారం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మేడ్చల్ తహసిల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశమై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్, రెవెన్యూ అధికారులు దరఖాస్తుల పరిష్కారం కోసం క్షేత్ర స్థాయికి వెళ్లి స్థితిగతుల పరిశీలన చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ భూపాల్, మండల రెవెన్యూ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విలీన గ్రామ కార్మికులకు సమాన వేతనాలు

పోచారం: మున్సిపాలిటీలో ఇటీవల విలీనమైన గ్రామాల్లో పనిచేసే కార్మికులకు మున్సిపల్ కార్మికులతో సమానంగా వేతనాలు పెంచారు. దీంతో హర్షం వ్యక్తం చేసిన కార్మికులు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డిని ప్రతాపసింగారంలోని తన నివాసంలో మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో పనిచేసే కార్మికులకు ఇచ్చే రూ. 7 వేల జీతాన్ని మున్సిపల్ కార్మికులతో సమానంగా రూ.16,600 చేయడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. పోచారం మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు గాంధారి అశోక్, కార్యదర్శి చంద్రమౌళి, సూపర్‌వైజర్లు వినోద్‌రెడ్డి, సుభాష్, మహేష్, భిక్షపతి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కీసరలోనే నవోదయకు శాశ్వత భవనం ఏర్పాటు చేయాలి

కీసర: రాష్ట్రంలో కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి దేవాలయం అతి పెద్దదని, కీసర మండలంలోనే నవోదయ పాఠశాల శాశ్వత భవనం ఏర్పాటు చేయాలని, బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి ఓ ప్రకటన ద్వారా తెలిపారు. కీసరలో నవోదయ పాఠశాలను తాత్కాలికంగా ఏర్పాటు చేశారని, శాశ్వతంగా నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు.

ల్యాండ్ పూలింగ్‌తో దళిత కుటుంబాలకు మేలు

సీఎం నిర్ణయంపై బోడుప్పల్ హర్షం వ్యక్తం చేసిన దళిత రైతులు



సాక్షి,సిటీబ్యూరో: సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 దళితుల కుటుంబాలకు మేలు చేకూరుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ తెలిపారు. మంగళవారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి భూయజమానులు, కాంగ్రెస్ నేతలతో ఆయన మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరిని కలిసి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ప్రతి దళిత రైతుకు భూ యాజమాన్యం హక్కులకు సంబంధించిన పత్రాలు అందిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ హమీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నేత తోటకూర వజ్రేష్‌యాదవ్ తెలిపారు. దళితుల భూమిని ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ ద్వారా ఎకరానికి 600 గజాల చొప్పున ఇచ్చేలా చర్యలు తీసుకోవడంతో సంబంధిత రైతులు స్వచ్ఛందంగా అంగీకారం తెలిపారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా దళిత రైతు కుటుంబాలు ఆర్థిక ప్రగతి సాధించేలా చర్యలు తీసుకుందన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బీ– బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్‌గౌడ్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రాపోలు ఉపేందర్, మాజీ కార్పొరేటర్ చీరల నరసింహ, కాంగ్రెస్ పార్టీ నాయకులు చీరాల జంగయ్య, దానగళ్ల యాదగిరి, రాపోలు రామస్వామి తదితరులున్నారు.

గిర్మాపూర్ పాలిటెక్నిక్ కళాశాలకు బస్సు నడపాలి

మేడ్చల్: విద్యార్థుల సౌకర్యార్థం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వరకు నిత్యం ఉదయం సాయంత్రం మేడ్చల్ నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్‌ను ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఆదేశాలు జారీచేసి ఆదేశపత్రాలను పట్టణ బీఆర్‌ఎస్ నాయకులకు ఇవ్వగా.. వారు అసిస్టెంట్ డీఎం రామారావుకు అందజేశారు. గిర్మాపూర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలకు బస్సులు లేకపోవడంతో విద్యార్థులు వచ్చిపోవడానికి బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గిర్మాపూర్ వరకు బస్సులు నడపడం వల్ల విద్యార్థులతో పాటు గిర్మాపూర్ వాసులకు రవాణా ఇబ్బందులు తొలుగుతాయన్నారు. ఉత్తర్వులను పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్ అధికారులకు అందజేశారు.


కీసరలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..


మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద..

మహానేతకు ఘన నివాళి

ఘనంగా వైఎస్‌ఆర్ జయంతి వేడుకలు

మేడ్చల్ జోన్ పరిధిలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్‌నేతలు, వైఎస్‌ఆర్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆయన విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నేతలు మాట్లాడుతూ.. వైఎస్‌ఆర్ మహానేతగా ప్రతి ఒక్కరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన అందించిన సంక్షేమ ఫలాలు ప్రతి పేదవాడికి అందాయని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. – మేడ్చల్ జోన్ బృందం.


అంకుషాపూర్‌లో వజ్రేష్‌యాదవ్, మహేష్‌గౌడ్ తదితరులు


బాసిరేగడిలో వైఎస్‌ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్థానిక నాయకులు


జవహర్‌నగర్‌లో..


దేవరయాంజాల్‌లో..